
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



సోమశిలలో 72.49 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 72.49 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 15,425 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,17,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,564
3 శాతం జీఎస్టీతో	రూ.10,880
నవర (8 గ్రా)	రూ.87,040

గరిష్టం/కనిష్టం
35.7 /27.0

వాతావరణం

జిల్లాలో ఉక్కపోత వాతావరణం శుక్రవారం ఉంటుందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 53 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

జెడ్పీ చైర్‌పర్సన్‌కు అభినందన



నెల్లూరు(పొగతోట): జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఆనం అరుణమ్మ బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తయిన తరుణంలో ఆమెను జెడ్పీ కార్యాలయంలో సీఈఓ మోహన్‌రావు, అధికారులు అభినందనలు తెలిపారు. సహాయ, సహకారాలను అందించిన ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీలు, సీఈఓ, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పొదలకూరులో జాబ్‌మేళా రేపు

నెల్లూరు(పొగతోట): పొదలకూరులోని కాకతీయ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 14 పరిశ్రమల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్‌మేళాను నిర్వహించనున్నామని, వివరాలకు 93812 65558, 87126 55686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు రేపు

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘాల సమావేశాలను శనివారం ఉదయం 10.30 నుంచి నిర్వహించనున్నామని సీఈఓ మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఇంటర్ పరీక్ష ఫీజును 10లోపు చెల్లించాలి

నెల్లూరు (టౌన్): ఇంటర్ పరీక్షల ఫీజును వచ్చే నెల పదిలోపు చెల్లించాలని ఆర్ఐఓ వరప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. రూ.వెయ్యి అపరాధ రుసుముతో వచ్చే నెల 21 వరకు చెల్లించొచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించేలా ప్రిన్సిపల్స్ చర్యలు చేపట్టాలని కోరారు. ఏ కారణంతోనైనా పరీక్ష ఫీజును కట్టించుకోకపోతే సదరు కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

పోక్సో కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్): పదిహేనేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో పొదలకూరు బాలాజీనగర్‌కు చెందిన లఘుసాని ప్రసాద్, సహకరించిన భార్య గాయత్రి, కొంగర రవీంద్రబాబుకు పదేళ్ల జైలు, రూ.20 వేల చొప్పున జరిమానాను విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. పొదలకూరులో పదో తరగతి చదువుతున్న ఓ బాలిక రోజూ సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది వరకు ట్యూషన్‌కు వెళ్లొచ్చేది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన నిందితుడు ప్రసాద్.. 2015, సెప్టెంబర్ 20 రాత్రి ఎనిమిది గంటల సమయంలో బాలికను బలవంతంగా తీసుకెళ్లాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పొదలకూరు పోలీసులు కేసును అదే రోజు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం ప్రసాద్, గాయత్రి, కొంగర రవీంద్రబాబు, మల్లాడి ప్రసాద్, మల్లాడి మాధవిపై కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో ప్రసాద్, గాయత్రి, రవీంద్రబాబుకు పైమేరకు శిక్ష జరిమానా.. మిగిలిన ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసును కొట్టేస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. స్పెషల్ పీపీ దుబిశెట్టి చంద్రశేఖర్ వాదించారు.

డీసీపల్లిలో 595 బేళ్ల కొనుగోలు



మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో 595 బేళ్లను గురువారం కొనుగోలు చేశారని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 977 బేళ్లు రాగా, అందులో 595ను కొనుగోలు చేశారని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారని చెప్పారు. కిలో పొగాకు కు గరిష్టంగా రూ.340.. కనిష్టంగా రూ.85.. సగటున రూ.205.23 లభించిందని వివరించారు.

నిమ్మకు గడ్డు కాలం



- ఎగబాకని ధరలు
- డిమాండ్‌కు మించి పండిస్తూ..
- కోల్డ్ స్టోరేజీ, సిట్రస్ ఫ్యాక్టరీ నిర్మిస్తేనే ఫలితం

ఇతర రాష్ట్రాల్లో పెరుగుతున్న సాగు

నిమ్మను అతిగా సాగు చేస్తుండటంతో మార్కెట్లో డిమాండ్ తగ్గుతోంది. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే గడ్డు కాలం ఏర్పడే అవకాశం ఉందని వ్యాపారులతో పాటు రైతులు సైతం అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి మెట్ట నియోజకవర్గాల్లో నిమ్మ సాగు నుంచి కర్షకులను విడదీయలేని పరిస్థితులున్నాయి. సుమారు ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో తోటలను సాగు చేస్తూ అందులోనే తమ జీవితం ఉందని వారు భావిస్తున్నారు. కొందరైతే ఇతర పంటలను పండించకుండా, తోటలను నాలుగైదు చోట్ల సాగు చేస్తున్నారు. ఫలితంగా దిగుబడి గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు ఇక్కడ ఫ్యాక్టరీలు, కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో నష్టమో, లాభమో కాయలు కోసి యార్డుల్లోనే విక్రయించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. బయటి రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం పెరగడం సైతం రైతుల ఇబ్బందులకు కారణమవుతోంది.

పొదలకూరు: ఉద్యాన పంటల్లో నిమ్మ సాగు మేటిగా ఉంది. వెంకటగిరి సమీపంలోని పెట్లూరు వద్ద పరిశోధన స్థానాన్ని గతంలోనే ఏర్పాటు చేశారు. సర్వేపల్లి, వెంకటగిరి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో 28,437 ఎకరాలకుపైగా నిమ్మ సాగవుతోంది. ఒక్క పొదలకూరు మండలంలోనే సుమారు నాలుగు వేల ఎకరాల్లో పండిస్తున్నారు. ఫలితంగా ఇక్కడ ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డును రెండు దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేశారు.

ఎంతో మందికి జీవనోపాధి

సీజన్లో ఇక్కడి నుంచి నిత్యం 15 లారీల్లో కాయలు ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు ఎగుమతవుతుంటాయి. ఇలా 300 టన్నుల కాయలు వెళ్తుంటాయి. వందలాది మందికి ఇది జీవనోపాధిగా మారింది. ఈ ప్రాంతంలో చాలా మంది రైతులకు రెండు వేల నిమ్మ చెట్లున్నాయి. చాలా కాలం పాటు ఇక్కడ పండేదే నిమ్మగా చెలామణి అయింది. అయితే ప్రస్తుతం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ సాగవుతోంది. కర్ణాటకలోని బిజాపూర్, తెలంగాణలోని నకిరేకల్.. మన రాష్ట్రానికి పోటీగా మారాయి. మార్కెట్‌ను శాసించే ఢిల్లీకి బయటి రాష్ట్రాల నుంచి కాయలు ఎగుమతవుతున్నాయి. దీంతో ఇక్కడి మార్కెట్ తరచూ తారుమారవుతోంది.



పొదలకూరు మార్కెట్ యార్డులో కాయలను ప్యాక్ చేస్తున్న కూలీలు

పతనమవుతున్న ధరలు

ఢిల్లీకి కాయలు అధికంగా ఎగుమతవుతున్న నేపథ్యంలో డిమాండ్ తగ్గి ధరలు పతనమవుతున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో రైతులకు గిట్టుబాటు ధరలూ లభించడం లేదు. ఇక్కడ దాదాపు మూడు నెలలుగా ధరలు ఆశాజనకంగా పెరిగిందీ లేదు. ఈ ఏడాది వేసవిలో కొద్ది రోజులు ధరలు పలికి ఆ తర్వాత తగ్గుతూ వచ్చాయి. దీంతో భవిష్యత్తులో ఈ ప్రాంతంలో తోటలను తగ్గించుకుంటేనే మేలనే భావన కర్షకుల్లో వ్యక్తమవుతోంది.

కోల్డ్ స్టోరేజీ, సిట్రస్ ఫ్యాక్టరీ అవసరం

పొదలకూరులో కోల్డ్ స్టోరేజీ, సిట్రస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా భావిస్తున్నా, కార్యరూపం దాల్చడం లేదు. ఇదే అంశమై రైతులు విజ్ఞప్తి చేస్తున్నా, ఎలాంటి ప్రయోజనం లభించడం లేదు. కోల్డ్ స్టోరేజీ ఉంటే కోసిన కాయలను రెండు, మూడు రోజుల వరకు నిల్వ చేసుకునేందుకు వీలు కలుగుతుంది. నిమ్మను 80 శాతం ఇంటి అవసరాలకు.. మిగిలిన 20 శాతాన్ని కాస్మొటిక్స్, ఆహారోత్పత్తులకు వినియోగిస్తున్నారు. నిమ్మకు అనుబంధంగా ఫ్యాక్టరీని స్థానికంగా ఏర్పాటు చేస్తే రైతులకు ఊరట లభిస్తుంది. ఇలాంటి ఫ్యాక్టరీని పొదలకూరు ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిమ్మ తోటలు

జిల్లాలో సాగు ఇలా..

- విస్తీర్ణం - 28,437 ఎకరాల్లో
- సీజన్లో యార్డు నుంచి ఎగుమతులు - 15 లారీల్లో..
- ప్యాక్ చేసి ఎగుమతి చేసే కాయలు - 300 టన్నులు

విస్తీర్ణం తగ్గలేదు



తోటల విస్తీర్ణం తగ్గలేదు. నిమ్మకు చీడపీడలు అధికంగా ఉంటాయి. రైతులు సకాలంలో స్పందించి పిచికారీ చేసుకుంటే అదుపులో ఉంటాయి. కాయల ధరలు బాగా పెరిగి ఆర్థికంగా స్థిరపడిన సమయంలో తోటల విస్తీర్ణాన్ని బాగా పెంచారు.

– ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

సాగు తగ్గించడమే మేలు



నిమ్మ సాగును కొంత వరకు తగ్గించడమే మేలు. బోర్ల ద్వారా నీటి సౌకర్యం ఉన్న ప్రతి రైతు దీనిపై మక్కువ చూపుతున్నారు. దిగుబడి పెరిగితే డిమాండ్ తగ్గుతుందనే విషయాన్ని తెలుసుకోవాలి. మూడు నెలలే అంతో ఇంతో డిమాండ్ ఉంటుంది. ఆ తర్వాత కష్టాలు పడాల్సి వస్తుంది. కూలీలు సైతం గిట్టుబాటు కాక ఇబ్బందులు పడ్డాం.

– శంకర్‌రెడ్డి, రైతు, ముదిగేడు

కష్టంగా ఉంది



నిమ్మ సాగు కష్టంతో కూడుకున్న పని. కంపోస్ట్ ఎరువులను ఏటా తోలి యాజమాన్య పద్ధతులను చేపట్టాల్సి ఉంటుంది. పెట్టుబడులు బాగా అవుతున్నా, అందుకు తగిన విధంగా రాబడి ఉండటం లేదు. వేసవిలోనే ధరలు పతనమైతే రైతులు కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. సాగు తగ్గించుకోవడమే మంచిదనిపిస్తోంది.

– దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

భవిష్యత్తులో ఇబ్బందులు



నిమ్మకు ఇప్పటికిప్పుడు వచ్చిన ఇబ్బందుల్లేకపోయినా, భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. బయటి రాష్ట్రాల్లో నిమ్మ సాగు పెరుగుతోంది. బిహార్‌లో సైతం దీన్ని పండిస్తున్నారంటే ఆశ్చర్యంగా ఉంది. మన ప్రాంతంలో డిమాండ్ తగ్గేందుకు ఇదీ ఓ కారణంగా భావించాల్సి వస్తోంది.

– బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు, పొదలకూరు

మెంటల్ బాలకృష్ణా.. నోరు అదుపులో ఉంచుకో

- అభిమానులను కొట్టే సంస్కృతి నీదే..
- పిచ్చి పీక్స్‌కు పోయిందా.. రాత్రి తాగింది దిగలేదా..?
- ధ్వజమెత్తిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షిప్రతినిధి, నెల్లూరు: సినీ నటుడు బాలకృష్ణకు మెంటల్ ఉందని.. ఈ విషయమై తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని.. తనకు మతిస్థిమితం లేదని డాక్టర్ల వద్ద ఆయన సర్టిఫికెట్‌ను తెచ్చుకున్నారని.. అలాంటి వ్యక్తి అసెంబ్లీలో తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఖండించారు. ఈ మేరకు నెల్లూరులో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడంతో పాటు చిరంజీవిని అవమానించారని పేర్కొనడాన్ని తప్పుబట్టారు. నటులను జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ అవమానించలేదన్నారు. ఆయన్ను కలిసేందుకు చిరంజీవి గతంలో వెళ్లినప్పుడు సాదరంగా ఆహ్వానించారని, అంతేకాకుండా కలిసి భోజనం చేశారని గుర్తుచేశారు. వాస్తవాలను వక్రీకరించి బాలకృష్ణ మాట్లాడటం దారుణమన్నారు. దగ్గరికొచ్చిన అభిమానులను కొట్టడం, ఫోన్లో తిట్టడం లాంటి ఛండాలమైన సంస్కృతి బాలకృష్ణదేనని విమర్శించారు.. బాలకృష్ణకు పిచ్చి పీక్స్‌కు చేరి.. రాత్రి తాగింది ఇంకా దిగక ఇలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నోటిని అదుపులో ఉంచుకోవాలని, లేని పక్షంలో జరగబోయే తీవ్ర పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

తప్పుడు కేసులకు భయపడేదిలేదు



మాట్లాడుతున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మనీ స్కామ్‌లో డబ్బులు కొట్టేశారు
- కావలిలో కక్ష రాజకీయాలకు ఊతం
- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి(అల్లూరు): తప్పుడు కేసులకు భయపడేదిలేదని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణానికి గురువారం చేరుకున్న ఆయనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఇబ్బందుల్లో ఉన్న సమయంలో తన కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలను తెలియజేశారు. అక్రమ కేసులు మోపి పోలీస్ వ్యవస్థను అడ్డంపెట్టుకొని కూటమి ప్రభుత్వం సైకో పాలనను సాగిస్తోందని మండిపడ్డారు. ప్రశాంతతకు మారుపేరైన కావలిని ప్రస్తుత ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. ఆయన చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. మనీ స్కామ్‌లో డబ్బులు దోచుకోవడం.. ఇసుక దందా.. గ్రావెల్.. మైన్స్.. రేషన్ మాఫియాను ప్రశ్నిస్తున్న తనపై కక్షగట్టి తప్పుడు కేసులు మోపారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్తే వాస్తవాలను ప్రజలు చెప్తారన్నారు. అభివృద్ధిని గాలికొదిలారని చెప్పారు. డిజిటల్ బుక్‌ను తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని వివరించారు. తమ పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించినా.. కక్షసాధింపు చర్యలకు పాల్పడినా.. అరాచకాలు చేసినా వెంటనే యాప్‌లో పొందుపర్చాలని కోరారు. తాము అధికారంలో వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడి వర్గంపై సైతం తప్పుడు కేసులు పెట్టిన చరిత్ర కృష్ణారెడ్డిదని విమర్శించారు. విలేకరులను సైతం వదలకుండా కేసులు పెట్టి జైల్లో పెట్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇలాంటి కక్షసాధింపు చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి పది గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ గురువారం సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో ఏడు కంపార్ట్‌మెంట్లు నిండాయి. స్వామివారిని 58,628 మంది భక్తులు బుధవారం అర్ధరాత్రి వరకు దర్శించుకున్నారు. తలనీలాలను 21,551 మంది సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.01 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి పది గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారు మూడు గంటల్లోనే దర్శించుకోగలుగుతున్నారు.

పక్కాగా స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్



పరిశీలిస్తున్న స్టెఫీ తదితరులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో అమలు చేస్తున్న స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌ను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ఎస్సెన్సీపీఏ ప్రోగ్రామ్ అధికారి స్టెఫీ పేర్కొన్నారు. నెల్లూరు పర్యటనకు గురువారం వచ్చిన ఆమె జిల్లాలోని వరిగొండ, దామరమడుగు తదితర పీహెచ్‌సీల్లో మహిళలకు నిర్వహిస్తున్న పరీక్షలను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో 490 క్యాంపులను నిర్వహించి.. 42,192 మందికి స్క్రీనింగ్ పరీక్షలను చేశారని వివరించారు. మెరుగైన చికిత్స అవసరమైన వారిని పెద్దాస్పత్రికి పంపి వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ప్రోగ్రామ్ నోడల్ అధికారి బ్రహ్మేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి సిల్క్స్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మీనాక్షి చౌదరి, సుమ తదితరులు

- సందడి చేసిన నటి మీనాక్షి చౌదరి



నెల్లూరు(బృందావనం): నగరంలోని మినీబైపాస్‌లో వారాహి సిల్క్స్ షోరూమ్‌ను సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సంప్రదాయ, ఫ్యాషన్ వస్త్రాలకు పెట్టింది పేరైన వారాహి సిల్క్స్‌కు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నానని చెప్పారు. షోరూమ్‌ను యాంకర్ సుమ కనకాల, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మణిదీప్ ఏచూరి, డాక్టర్ స్పందన మద్దుతో కలిసి అభిమానుల సమక్షంలో ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. అభిమానులతో సెల్ఫీలు దిగుతూ తాను నటించిన చిత్రాల్లోని డైలాగులు చెప్తూ సందడి చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్లు మాట్లాడారు. రాష్ట్రంలో మొదటి షోరూమ్‌ను నెల్లూరులో ప్రారంభించామని చెప్పారు. హైదరాబాద్‌లోని ప్యాట్నీ సెంటర్, విజయవాడలో షోరూమ్‌లను త్వరలో ప్రారంభించనున్నామని వెల్లడించారు. రూ.500 నుంచి రూ.10 లక్షల వరకు చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.పది వేల వస్త్రాల కొనుగోలుపై 22 క్యారెట్ల బంగారు నాణేన్ని అందిస్తున్నామని, ఈ ఆఫర్ అక్టోబర్ ఐదు వరకు ఉంటుందని తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా నవీకరణ

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



మాట్లాడుతున్న హిమాన్షు శుక్లా

నెల్లూరు రూరల్: ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా నిరంతరం కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫారం – 6లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వీటిని సంపూర్ణంగా పూర్తి చేసేలా నూతన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని పేర్కొన్నారు. డీఆర్వో విజయ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మస్తాన్

వెంకటాచలం: తనపై పలుమార్లు దాడి జరిగినా పోలీసులు సరైన న్యాయం చేయడంలేదంటూ వెంకటాచలం పోలీస్‌స్టేషన్లో పురుగు మందు తాగి మండలంలోని పూడిపర్తికి చెందిన ఆటో డ్రైవర్ తుంగా మస్తానయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుడి సోదరుడు శ్రీనాథ్ వివరాల మేరకు.. పూడిపర్తికి చెందిన మస్తాన్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చుట్టుపక్కల ఉండేవారు మస్తాన్‌తో తరచూ గొడవపడేవారు. ఇటీవల వినాయక చవితి ఉత్సవాల్లో మస్తాన్‌తో గొడవపడి మాకుమ్మడిగా దాడి చేశారు. ఘటనపై వెంకటాచలం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఇరువర్గాలను పోలీసులు పిలిచి రాజీ చేసి పంపారు. తాజాగా గ్రామానికి చెందిన కావలి పెద్ద వెంకటరమణయ్య, కార్తీక్ మరికొందరు తన నివాసంలో ఉన్న మస్తాన్‌పై గురువారం ఉదయం మరోసారి దాడి చేశారు. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో, గ్రామానికి వారొచ్చి మస్తాన్‌తో పాటు రావాలని చెప్పడంతో అక్కడికి వెళ్లారు. తనపై దాడికి పాల్పడినా, న్యాయం జరగడంలేదనే మనస్తాపంతో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును మస్తాన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు గమనించి వెంకటాచలంలోని సీహెచ్‌సీకి.. ఆపై మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అపురూపం.. అమ్మరూపం

జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వివిధ రూపాల్లో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్


నెల్లూరు : అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు



నెల్లూరు : భవానీ అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు


మూలాపేటలో బాలాత్రిపురసుందరి అలంకారం


కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణ అలంకరణ


జొన్నవాడలో మధుకైటభ వధ అలంకారంలో కామాక్షితాయి


రాపూరు : పెంచలకోనలో ధైర్యలక్ష్మిగా ఆదిలక్ష్మీదేవి

కన్నవారికి కన్నీళ్లు మిగిల్చి..

- అదృశ్యమైన బాలురు.. అనంతలోకాలకు..
- మరణంలోనూ వీడని స్నేహ బంధం
- ఉయ్యాలపల్లిలో విషాదం
- పొట్టన బెట్టుకున్న గ్రావెల్ మాఫియా

కలువాయి(సైదాపురం): మట్టి మాఫియా ఇద్దరు బాలుర ప్రాణాలను బలిగొంది. ఆడుతూ పాడుతూ.. కలేకాయల కోసం వెళ్లిన వారు మృత్యుఒడిలోకి చేరుకున్నారు. పోలీసుల బృందం శ్రమించి బురద గుంతల్లో నుంచి మృతదేహాలను వెలికితీసింది. దీంతో రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఉయ్యాలపల్లి గ్రామానికి చెందిన నూతేటి ప్రసాద్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నూతేటి విష్ణుకుమార్ (11) స్థానిక నవభారత్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మనబోటి నరసింహులు, సునీత దంపతుల కుమారుడు మనోబోటి నవశ్రావణ్ (12) స్థానిక ఎంపీయూపీ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ చిన్నప్పటి నుంచి స్నేహితులు. గ్రామానికి సమీపంలో డ్రాగన్ ఫ్రూట్ తోట ఉంది. ఇద్దరూ కలిసి బుధవారం సాయంత్రం డ్రాగన్ ఫ్రూట్స్, కలేకాయల కోసం ఇంటి నుంచి వెళ్లారు. చీకటిపడినా తిరిగి రాకపోవడంతో ఇరు కుటుంబాల్లో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం అందించారు. ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సంగం సీఐ వేమారెడ్డి, రాపూరు, కలువాయి, మర్రిపాడు, చేజర్ల ఎస్సైలు ఉయ్యాలపల్లి రాత్రి గ్రామానికి చేరుకున్నారు. బాలుర ఆచూకీ కోసం గ్రామస్తులతో కలిసి ముమ్మరంగా గాలించారు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో


గ్రావెల్ గుంతలో బాలుడి మృతదేహం

డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. డ్రోన్లను తీసుకొచ్చి వెతికారు. గురువారం మధ్యాహ్నం వరకు ఆచూకీ దొరకలేదు.

అతికష్టం మీద..

ఉయ్యాలపల్లి గ్రామ సమీపంలోని చెరువు వద్ద మట్టి మాఫియా తవ్విన గుంతల్లో మృతదేహాలు ఉన్నాయంటూ స్థానికులు పోలీసులు, బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉండటంతో యంత్రాలతో నీటిని మళ్లించారు. మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీశారు. విగతజీవులుగా మారిన విష్ణు, శ్రావణ్‌ను చూసి అక్కడున్న వారంతా కన్నీరుమున్నీరుగా రోదించారు. మట్టి గుంతలు తమ పిల్లల ప్రాణాలను బలిగొన్నాయని బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే నూరేళ్లు నిండాయా అంటూ రోదించారు.

శోకసంద్రంలో..

బాలుర మృతితో ఉయ్యాలపల్లె కన్నీటి సంద్రమైంది. ఇంటి నుంచి బుధవారం సాయంత్రం వెళ్లిన ఇద్దరి ఆచూకీ కోసం రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా గ్రామస్తులతోపాటు పోలీసులు వెతికారు. ఎక్కడో ఒకచోట ఉంటారు. ఇంటికొచ్చేస్తారని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో చెరువు వద్ద ఉన్న గుంతల్లో చనిపోయి కనిపించడంతో బాధిత తల్లిదండ్రుల్ని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలిసి తిరుగుతూ..

విష్ణుకుమార్, నవశ్రావణ్ చదివేది వేర్వేరు పాఠశాలలు, తరగతులైనా కలిసి తిరిగేవారు. ఎంతో ఆప్యాయంగా ఉండేవారు. గ్రామంలో సందడి చేసేవారు. ఆడుతూ.. పాడుతూ తిరిగే చిన్నారులను విధి చిన్నచూపు చూసింది. మరణంలోనూ స్నేహిబంధం వీడలేదు. నవ్వుతూ కనిపించే మీరు చనిపోయారా నాయనా అంటూ గ్రామస్తులు, బంధువులు బోరున విలపించారు.

ఆశలు సమాధి

ఉయ్యాలపల్లికి చెందిన నూతేటి ప్రసాద్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. కుటుంబ పోషణ భారం కావడంతో బతుకుదెరువు కోసం ప్రసాద్ కువైట్‌కు వెళ్లాడు. విష్ణుకుమార్ చివరివాడు కావడంతో అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. బిడ్డల్ని ఉన్నత చదువులు చదివించేందుకు ప్రసాద్ రూపాయి రూపాయి కూడబెడుతున్నాడు. అతను ఇటీవల కువైట్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. మళ్లీ తిరిగెళ్లే సమయంలో ఈ విషాదం జరగడంతో తన ఆశలు ఆడియాశలు అయ్యాయంటూ రోదించడం అందరినీ కలిచివేసింది. ఇక మనుబోటి నరసింహులు టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సునీత, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాడు. రెండో కుమారుడైన శ్రావణ్ నీటి గుంతలో పడి చనిపోవడంతో ఆ కుటంబం కన్నీరుమున్నీరవుతోంది.


బాలుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీస్


మృతదేహాల కోసం గ్రామస్తుల ఎదురుచూపులు

గరుడ వాహనంపై శ్రీవారి చిద్విలాసం


బంగారు గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి గురువారం రాత్రి మేళతాళాల నడుమ బంగారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకం, ఆ తర్వాత సుప్రభాతం, మూలమూర్తికి చందన అలంకరణ, శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కోన వీధులు భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగాయి.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15



ఎంత శాతం పనులు చేశారో చెప్పండి

- కాకాణి, బుర్రాపై విమర్శలు మానాలి
- వైఎస్సార్‌సీపీ నాయకులు

కందుకూరు: 'మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్, పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, నేతలను రామాయపట్నం పోర్టు వద్దకు వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారు. మా ప్రభుత్వ హయాంలో 51 శాతం పనులు పూర్తి చేస్తే కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలో ఎంత శాతం పనులు చేశారో ప్రజలకు చెప్పాలి' అని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉలవపాడు మండలాధ్యక్షుడు నన్నం పోతురాజు మాట్లాడుతూ పోర్టు పనులను పరిశీలిస్తే వాస్తవాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతో పోలీసుల ద్వారా అడ్డుకున్నారని చెప్పారు. టీడీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు స్థాయిని మరిచి వైఎస్సార్‌సీపీ నేతలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. బీపీసీఎల్‌కు ఎందుకు భూములు కట్టబెడుతున్నారని, దీని వెనుక ఏ స్థాయి ఒప్పందం జరిగిందని ప్రశ్నించారు. కందుకూరు పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల విస్తరణ పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు తాను నడిపే బియ్యం మాఫియా గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. గుడ్లూరు మండల ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ గతంలో రామాయపట్నం పోర్టు నిర్మాణం కోసం భూములిచ్చిన రైతుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని ఉద్యోగాల నుంచి తొలగించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మద్దసాని నవీన్ మాట్లాడుతూ గుడ్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు తమ నాయకుడు మధుసూదన్ యాదవ్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మండలంలో ఇసుక, గ్రావెల్, మద్యం వంటి మాఫియాను నాగరాజు ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయన్నారు. జిల్లా నాయకులు చీమల రాజా, ముప్పవరపు కిశోర్ మాట్లాడారు. సమావేశంలో లింగసముద్రం, కందుకూరు మండలాల కన్వీనర్లు నోటి వెంకటేశ్వరరెడ్డి, ఈదర రమేష్, నాయకులు తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, అప్పనబోయిన రాజేష్, పీవీ రమణయ్య, కాట్రగడ్డ వెంకట్రావ్, రావులకొల్లు బ్రహ్మానందం, గేరా మనోహర్, ఆదిలక్ష్మి, రహీమ్, తల్లపనేని గోపి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

తొలిసారిగా రాక్ ఫాస్పేట్ రవాణా


పోర్టులో నౌక

ముత్తుకూరు(పొదలకూరు): అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ రెండు మైలురాళ్లను నెలకొల్పినట్టు పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ గురువారం తెలిపారు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కోసం 1,84,649 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని మోసుకెళ్తున్న ఎంవీ యూరిబియా నౌక బెర్త్ నంబర్ 5 వద్ద ఈనెల 22న 24 గంటల్లో 61,500 మెట్రిక్ టన్నుల అత్యధిక డిశ్చార్జ్ రేట్‌ను సాధించినట్టు వెల్లడించారు. తొలిసారిగా రాక్ ఫాస్పేట్‌ను విజయవంతంగా రవాణా చేసినట్టు తెలిపారు. బ్లూ ఫాస్పేట్ లిమిటెడ్ కడప జిల్లాలోని తన ప్లాంట్ కోసం ఎంవీ గ్లామర్ నౌకలో 13,100 మెట్రిక్ టన్నులను తీసుకొచ్చినట్టు వెల్లడించారు. భవిష్యత్‌లో రాక్ ఫాస్పేట్‌ను తమ పోర్టు ద్వారా రవాణా చేయనున్నట్టు చెప్పారు. అదానీ కృష్ణపట్నం పోర్టు మార్కెటింగ్ బృందం సాధించిన విజయంగా సీఈఓ చెప్పుకొచ్చారు.

ఆర్థికంగా దెబ్బతిని..

- వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఆర్థికంగా చితికిపోయిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. వనంతోపులో నివాసముంటున్న రవికుమార్‌రెడ్డి (40)కి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతను ఓ కంపెనీకి చెందిన ఫ్యాన్లు, కూలర్ల డిస్ట్రిబ్యూటర్. వ్యాపారంలో నష్టాలు రావడంతో మానసికంగా కుంగిపోయాడు. ఇంటి వద్దనే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 23వ తేదీ రాత్రి మద్యంలో గడ్డిమందు కలిపి తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు గురించి వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబ సభ్యులు అతడిని బుధవారం తెల్లవారుజామున జీజీహెచ్‌లో చేర్పించారు. రవికుమార్‌రెడ్డి అక్కడ చికిత్స పొందుతూ రాత్రి చనిపోయాడు. మృతుడి భార్య నిర్మల గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రొఫెసర్ సతీష్ ధవన్‌కు ఘన నివాళి


సతీష్ ధవన్ మెమోరియల్ వద్ద నివాళులర్పించిన షార్ శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పితామహుల్లో ముఖ్యులైన ప్రొఫెసర్ సతీష్ ధవన్ 104వ జయంతిని గురువారం షార్ కేంద్రంలోని గగన్‌యాన్ మిషన్ కంట్రోల్ రూంలో ఘనంగా నిర్వహించారు. షార్ రెండో గేట్ సమీపంలోని జీరో పాయింట్ వద్ద సతీష్ ధవన్ మెమోరియల్‌ను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆయన విగ్రహానికి, మిషన్ కంట్రోల్ రూంలో చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెళియన్ మాట్లాడుతూ భారత అంతరిక్ష ప్రయోగాల్లో ప్రొఫెసర్ సతీష్ ధవన్ అత్యంత సాంకేతికపరమైన ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన మొదటి తరం శాస్త్రవేత్తగా చరిత్రకెక్కారని చెప్పారు. అంతరిక్ష ప్రయోగాలను తొలితరం శాస్త్రవేత్త డాక్టర్ విక్రమ్ సారాభాయ్ బుడి బుడి అడుగులతో నడిపిస్తే, సతీష్ ధవన్ దానికి నడక నేర్పించడంతో ప్రస్తుతం ప్రపంచంలోనే ఇస్రో బలీయమైన సంస్థగా ఆవిర్భవించిదన్నారు. సతీష ధవన్ ఆధ్వర్యంలో అంతరిక్ష ప్రయోగాల పరంపర ప్రారంభమైందన్నారు. ఇస్రో తొలినాళ్లలో చిన్న తరహా రాకెట్ ప్రయోగాలు మొదలు ప్రస్తుతం చంద్రయాన్ – 3, ఆదిత్య ఎల్1 వరకు, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్ల ప్రస్థానం, సౌండింగ్ రాకెట్లు, 40 కిలోల బరువు కలిగిన చిన్నపాటి ఉపగ్రహాలను పంపించే స్థాయి నుంచి నేడు ఆరు టన్నుల బరువు కలిగిన అన్ని రకాల ఉపగ్రహాలను సొంతంగా తయారు చేసుకుని ప్రయోగించే వరకు ఎదిగిన వైనం, సాధిస్తున్న విజయాల వెనుక అప్పట్లో ఆయన వేసిన పునాదుల గురించి వివరించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ రమేష్ కుమార్, షార్ అధికారులు పి.గోపీకృష్ణ, అన్ని విభాగాల అసోసియేట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కండలేరులో 54.350 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 54.350 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10.100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

దసరా మామూళ్ల కోసం హిజ్రాల వీరంగం

- ధాబాలో సిబ్బందిపై దాడి
- 13 మంది అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో కొందరు హిజ్రాల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. డబ్బు కోసం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. నెల్లూరు నగరంలోని ఓ ఫ్యామిలీ ధాబాలో దసరా మామూళ్ల కోసం వీరంగం చేయడంతోపాటు సిబ్బందిపై దౌర్జన్యం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు వివరాలు వెల్లడించారు. మినీబైపాస్ రోడ్డులో శ్రీహరినగర్ వద్ద శ్రీవెంగమాంబ పంజాబీ ఫ్యామిలీ ధాబా ఉంది. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 13 మంది హిజ్రాలు అక్కడికెళ్లారు. దసరా మామూలు ఇవ్వాలని మేనేజర్ హేమంత్‌ను డిమాండ్ చేశారు. అతను యజమాని లేడని చెప్పడంతో కోపోద్రిక్తులైన వారు దౌర్జన్యానికి దిగారు. వెంటనే యజమానిని ఫోన్ చేసి పిలిపించాలంటూ ధాబాలో వీరంగం సృష్టించారు. వీరి చేష్టలతో భోజనం చేస్తున్న కష్టమర్లు బయటకు వెళ్లిపోయారు. హిజ్రాలను సిబ్బంది అడ్డుకోబోగా వారిపై దాడి చేసి బీభత్సం సృష్టించి వెళ్లిపోయారు. మేనేజర్ ఈ విషయాన్ని యజమాని దృష్టికి తీసుకెళ్లారు. హేమంత్ బుధవారం రాత్రి బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా దౌర్జన్యం, దాడికి పాల్పడిన హిజ్రాలు సల్మా, సిరి, రవి, మాలిని, హైమ, సుకన్య, సమీరా, మయూరమ్మ, హీన, మానస, దేవి, హంస, బంగారమ్మగా గుర్తించారు. గురువారం వారిని అరెస్ట్ చేశారు. దసరా పండగ నేపథ్యంలో ఎవరైనా బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. హక్కుల కోసం రానున్న రోజుల్లో నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతాం' అని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజాఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, పలు సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అహ్మద్ మాట్లాడుతూ డిస్కం, ట్రాన్స్‌కో, జెన్‌కోల్లో ఎన్నో సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 5వ తేదీన కలిసి వచ్చే కార్మిక సంఘాలతో విజయవాడలో రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం, 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డిస్కంల వద్ద ధర్నాలు, నవంబర్ 10వ తేదీన 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమాలను తలపెట్టామన్నారు. అంతే కాకుండా పలు పోరాటాలు చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించామన్నారు. సమావేశంలో నాయకులు బొజ్జా సుమన్, టీవీవీ ప్రసాద్, రాజా, హజరత్తయ్య, పెంచలప్రసాద్, బాబు, నాగయ్య, దయాకర్, ప్రసన్నకుమార్‌రెడ్డి, సునీల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అహ్మద్, చిత్రంలో సంఘాల నేతలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.115
లేయర్	: రూ.110
బ్రాయిలర్ చికెన్	: రూ.210
స్కిన్‌లెస్ చికెన్	: రూ.232
లేయర్ చికెన్	: రూ.187

